# పశుభో'జనం'

"ఆదివారం ... అర్ధాంగి తరపు బంధువులింట్లో పెళ్ళి. వెళ్ళకుంటే బాగుండదు గదరా !" పిచ్చాపాటిగా మాట్లాడుకుంటున్న మిత్రుల మధ్య నుంచి లేవబోయాడు ప్రకాశం. మిగతా మిత్రుల్లాగే అతడు గూడా మధ్య తరగతి మందహాసానికి నిలువెత్తు నిదర్శనమైన నాన్‌గెజిటెడ్ ప్రభుత్వోద్యోగి. ఉంగరాల జుట్టు, వెల్లకిలా ఉంచిన బొంగరం ఆకారంలో మీసం కట్టు సింగారం, సామనఛాయ ఒంటిమీద తళతళ మెరిసిపోతున్న తెల్లని ఫుల్ షర్టు ... హుందాగా ఉన్నాడారోజు.

మాటల ద్వారా కోటలు దాటుతూ వీధిరాజకీయాల నుండి విశ్వవిఫణి దాకా వెళ్లొచ్చారప్పటికే. ఆ తర్వాత ఆఫీసు బాసుల గ్యాసు కబుర్లు, అటెండర్ల ఆగడాలు, లేడీ కోలీగ్స్ బోడి ఫోసులు... వేడివేడి పకోడీల్లా వాడిగా నోట్లో కొచ్చి టైంపాసు బఠాణాలుగా మారిపోయినై.

"ఇలా 'లేచిపోవడం' బాగా లేదురా !" జోకు వేశాననుకుంటూ భుజాలు పట్టి కూచోబెట్టాడు నగరేశం.

"జంటగా కాదురా నాయనా, ఒంటరిగా వెల్తున్నా." నీ జోకు లోకల్ మేడ్ దీపావళి టపాసులా తుస్సుమంది అన్నట్టుగా నవ్వేసి సర్దుక్కూచున్నాడు ప్రకాశం.

"భార్యా పిల్లల్ని నిన్ననే పంపావు గదరా !" గుర్తు చేశాడు రామచంద్రం.

"ఇంకేమన్నా కబు...క్కబుర్లు చెప్పండిరా.... !" అంటూ ఆవులించాడు గూడా. అరనిమిషంలో ఐదారు దోమలు నోట్లోకి షికారు కెళ్లొచ్చాయి.

"పెళ్లితంతు చూద్దం వాళ్లవంతు. విందు భోజనం మనవాడి వంతు..." ఎత్తు పళ్లు బయటపడకుండా జాగ్రత్త పడుతూ నవ్వేశాడు నగరేశం.

శూన్యంలోకి చూస్తున్న రామచంద్రం బుర్రలో పంచరంగుల చిత్రము... కొత్త సినీ హీరోయిన్ అర్ధనగ్న నృత్యము తలుక్కున మెరిసింది. ఆ మెరుపు కళ్ళల్లోకి ప్రవహించి కదిలింది. "ఈ రోజు సండే. సండే అంటే హాలీడే. హాలీడే అంటే జాలీడే. మన నలుగురం కలిసి సినిమా చూడక నాల్గునెలైంది. సినిమాలు చూడకుండా... లైఫులో థ్రిల్లేముందిరా ? ఈ రోజు... మనం మ్యాట్నీ సినిమా కెల్తున్నాం... అంతే... !" కరాఖండిగా చెప్పేశాడు.

"అవునవును..." ఎకాఎకిన ఏకాకి చేసిన నిర్ణయం ఏకగ్రీవమైపోయింది.

"ఇప్పుడు పన్నెండైంది..." చేతి గడియాం చూసుకున్నాడు సుందర్రావు. "మ్యాట్నీ

రెండింటికి. భోజనాలు ముగించుకుని మనమంతా ఒకటిన్నరకల్లా ఊర్వశి ముందుండాలి."

అంతటితో ఆపూట మాటామంతి ముగింపుకొచ్చింది.

* * *

నలుగురిలో ముగ్గురు ముందుగానే చేరుకున్నారు. ఊర్వశి థియేటర్ ఒడిలో జనాల రద్దీ ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. కొత్తగా రిలీజైన చిరంజీవి సినిమా. చిరంజీవుల కోలాహలంతో... కొత్తకొండ జాతరలాగుంది.

ముగ్గురి శక్తియుక్తుల్ని నగరేశంకు ధారబోసి, ధైర్యసాహసాలు ప్రదర్శించి నాలుగు టికెట్లు సంపాదించే సరికి చావుదప్పి కన్నులొట్ట బోయినంత పనైంది. అయినా... విజయగర్వంతో ఊగిపోతున్నారు.

"ప్రకాశం గాడింకా రాలేదేమిట్రా ?" "పెళ్లి భోజనం చేసి పడకకెక్కేశాడేమో !" నగరేశం పెదాలు చప్పరించాడు – టికెట్లు సంపాదించిన తన సాహస చర్యల గురించి కాస్సేపు ముచ్చటించుకోవచ్చనే ఆరాటంతో

"ఇదో... ఇటు... ఇటు... చూడండి." పక్కన పదిగజాల దూరం నుండి పరిచయం ఉన్న గొంతు వినబడింది. అందరి చూపులు ఆ శాల్తీ మీద వాలాయి.

రంగు రంగుల కొత్తరకం డిజైన్ల ఫుల్‌షర్టులో తమవైపే వస్తున్నాడో వ్యక్తి. వీడెవడబ్బా ! మాయ మాటలు చెప్పి టికెట్లు లాక్కుపోడు గదా !... రామచంద్రం మోహంలో రంగులు మారాయి.

"నేన్రా ... మీ ప్రకాశాన్నిరా ...!" ఐదు కిలోల ఆముదం తాగినట్టుంది మొహం. దగ్గరి కొచ్చి నుంచున్నాడు. షర్టు నిండా పప్పు, పచ్చడి, చారు... ఇంకేవేవో మరకలు... సరికొత్త డిజైన్లుగా కనబడుతున్నాయి. పరిశీలనగా చూసి పరేషానై పోయారు.

"అదేమిట్రా ? పెళ్లి భోజనం చేసింది. నువ్వా, నీ షర్టా ?" నగరేశంకు సందు దొరికింది. మోహం విచ్చుకుంది.

"చాల్లేరా నీ బోడిముండ జోకులు." ప్రకాశంకు కోపమొచ్చినట్టే వచ్చి మాయమైంది. "పెళ్లిలో ... బఫ్ భోజనం. అటు అక్షింతలు వేసి ఇటు భోజనానికి చొర బడ్డాం. సినిమా టైమైపోతుంది గదాని నేను గూడా ఆ గుంపులో గోవిందయ్యానై పోయాను. అందరిలో నేను గూడా...."

"ఆదరబాదరగా చొరబడ్డావు." సుందర్రావు మందహాసము. "పోటీ పడి ప్లేటందుకుని అన్నము, కూర, పప్పు, పచ్చడి, స్వీట్లు కోసం... తిరుగుతూ పోయావు. అందరి ప్లేట్లు నీ వీపును, ఛాతిని సరదాగా ముద్దించుకున్నాయి..."

"అవున్రా... అంతా నాగరికులే గాని బఫ్ భోజన మప్పుడు బఫెల్లోస్ కంటే అద్వాన్నంగా ప్రవర్తించారు. వాళ్ల ప్లేట్లకు తాకొద్దని నేనెన్ని రకాలుగా ప్రయత్నించినా.. ఫ్చ్... బ్రూట్స్... గమనించే వారే లేరు. పదార్థాలు వడ్డించిన ప్లేటు, సగం తిన్న ప్లేటు చేతిలో ఉంది గదానే స్పృహనే లేదు..." ఏడుపొచ్చినంత పనైంది - ప్రకాశంకు.

"నిజంరా !" రామచంద్రం మొహం గాంభీర్యాన్ని పులుముకుంది. "ప్లేట్లో పదార్థాలు వడ్డించుకుని దూరంగా వెళ్లి తినాలనే కామన్ సెన్స్ లేని వాళ్లుంటారు. ఆ పంచ భక్ష్య పరమాన్నాల నెవరో దోచుకెళ్తున్నట్టుగా, వాటి కాపలా దార్లలా అక్కడే నుంచుండి మెక్కుతుంటారు. వచ్చీపోయే వాళ్ల అవస్థనేమాత్రం గమనించరు. ఈ సంగతి పశువులకు తెలిస్తే మనుషుల్ని తిట్టి పొయ్యడం ఖాయం..."

"పార్టీలలో పశుభోజనం చేస్తున్నమన్న మాటే గాని పశువుల నుంచి మనమేమీ నేర్చుకోవడం లేదు. వాటిలా మనం గూడా గడ్డి తింటే బుద్ధొస్తుందేమో..." అనుభవ సారం ఒలకబోస్తూ ప్రకాశం షర్టు వాసన చూశాడు సుందర్రావు "వారెవ్వా ! మసాలా చారు, పప్పు, కూరలు... బలే జోరుగున్నటుందే !"

"వంటకాల రుచులు బాగానే ఉన్నాయి గాని... భోంచేస్తున్న వారి మనుసులే శుచిగా లేవు." నగరేశం బాధ.

"సమయం రెండైంది. ఇహ పదండిరా ప్రకాశం. సినిమా ఎంజాయ్ చేస్తూ... ఆ సంగతి మరచిపోవచ్చు." ప్రకాశం వీపు లాలనగా నిమిరాడు రామచంద్రం.

టికెట్ల సంపాదనలో తన సాహసాన్ని గురించి మరెప్పుడన్నా ముచ్చటించు కోవచ్చుని రాజీపడక తప్పలేదు నగరేశంకు.

***(జలధి - 1-1-2004)***